క్లుప్తంగా

పరామర్శ

హన్మకొండ అర్బన్ : హనుమకొండ రెడ్‌క్రాస్ పాలకవర్గ సభ్యుడు డాక్టర్ కె.సుధాకర్‌రెడ్డి సతీమణి పుష్పలత మంగళవారం మృతి చెందగా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి.విజయ చందర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు వారి స్వగృహానికి వెళ్లి ఆమె పార్థివదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. పరామర్శించిన వారిలో రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణగౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, పాలకవర్గ సభ్యులు వేణుగోపాల్, శ్రీనివాస్‌రావు, డాక్టర్ సిహెచ్.సంధ్యారాణి, తదితరులు ఉన్నారు.

ప్రపంచ ఆరోగ్య సదస్సుకు అసిస్టెంట్ ప్రొఫెసర్



కేయూ క్యాంపస్ : సౌత్రన్ తైవాన్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ తయనన్– తైవాన్‌లో ఈనెల 22 నుంచి 24 వరకు నిర్వహించనున్న ప్రపంచ ఆహార, ఆరోగ్య సదస్సుకు కేయూ పరిధిలోని హనుమకొండ ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నేరెళ్ల శ్రీనివాస్‌కు ఆహ్వానం అందించనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి మంగళవారం తెలిపారు. సదస్సులో సుమారు 25 దేశాలకు చెందిన ప్రఖ్యాత శాస్త్రవేత్తలు పాల్గొననున్నట్లు చెప్పారు. సదస్సులో పాల్గొనేందుకు కేంద్రప్రభుత్వం నుంచి ట్రావెల్ గ్రాంటు లభించిందని ప్రిన్సిపాల్ తెలిపారు.

పోలీసు కవాతు

హసన్‌పర్తి: మండలంలోని అన్నాసాగరంలో కేంద్ర బృందాలు కవాతు నిర్వహించాయి. ఎన్నికల దృష్ట్యా శాంతి భద్రతలకై ఈ కార్యక్రమం జరిగింది. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా జరిగిన కార్యక్రమంలో సీఐ గోపీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రీ ఆర్‌డీసీకి కేడీసీ విద్యార్థిని ఎంపిక



విద్యారణ్యపురి: ప్రీ ఆర్‌డీసీకి హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం కంప్యూటర్ ఫైనలియర్ చదువుతున్న ఎన్‌సీసీ కేడెట్ దొమ్మటి అఖిల ఎన్‌సీసీ సీ8 (టి) బాలికల బెటాలియన్ నుంచి ఎంపికైందని ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి తెలిపారు. మంగళవారం అఖిలను ప్రిన్సిపాల్‌తో పాటు వాణిజ్యశాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ ఎస్ వినోద్ రావు, ఎన్‌సీసీ 8 (టి) బాలికల బెటాలియన్ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ అయేషా పూలబొకేను అందించి అభినందించారు. కార్యక్రమంలో వాణిజ్యశాస్త్ర విభాగం అధ్యాపకురాలు సరళారూనీస్రాణి, లింగారెడ్డి, సుజాత, పావని, డాక్టర్ రాజీరు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు గురుకుల విద్యార్థిని



హసన్‌పర్తి : తెలంగాణ బాలికల గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థిని కె. స్వావెస్లా జాతీయ స్థాయికి ఎంపికైంది. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన 67వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో ఆమె పాల్గొని రజత పతకాన్ని సాధించింది. డిసెంబర్‌లో ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఇందుమతి తెలిపారు. మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినిని అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్వావెస్లా జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పాఠశాలకే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ సాంబయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మరు



వర్ధన్నపేట: అరూరి రమేశ్‌కు తిలకం దిద్ది స్వాగతం పలుకుతున్న మహిళలు



వర్ధన్నపేట: ప్రచారంలో మాట్లాడుతున్న అరూరి రమేశ్

● బీఆర్‌ఎస్ వర్ధన్నపేట అభ్యర్థి అరూరి

వర్ధన్నపేట : యాభై ఏళ్ల కాంగ్రెస్ పాలనలో చేసిన అభివృద్ధి, ప్రత్యేక రాష్ట్రంలో పదేళ్లల్లో బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధిని ప్రజలు బేరీజు వేసుకుని ఎన్నుకోవాలి.. కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటలు నమ్మి ఆగం కావొద్దని వర్ధన్నపేట బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మండలంలోని కట్ర్యాల, రామవరం, దివిటిపల్లి, దమ్మన్నపేట, బండౌతపురం, అంబేడ్కర్ నగర్, బొక్కలగూడెం, ల్యాబర్తి, కొత్తపల్లి, ఇల్లంద గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోకి రాగానే మహిళలు మంగళహారతులు, బతుకమ్మలతో, ఆట పాటలు, డప్పుచప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అరూరి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కే.ఆర్ నాగరాజు బూటకపు ఎన్‌కౌంటర్లు చేసి పేద కుటుంబాలను బజారున పడేసిన ఘనుడన్నారు. అలాంటి చరిత్ర ఉన్నవాడిని ప్రజలు ఎలా ఎన్నుకుంటారని ప్రశ్నించారు. కేవలం పోలీస్ దురహంకారంతో ఉన్నాడని, ప్రజలు ఆయనను నమ్మే స్థితిలో లేరని ఎద్దేవా చేశారు. పదేళ్ల కాలంలో తాను ప్రజల వెంటే ఉండి వారి కష్ట సుఖాల్లో పాలు పంచుకుంటూ కుటుంబంలో ఒకడిగా ఉండి సేవలు అందించానన్నారు. ప్రతి గ్రామంలో తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ, వీధి దీపాలతో పాటు చెరువుల అభివృద్ధి చేసి పల్లెలను సస్యశ్యామలం చేశానని వివరించారు. గత ప్రభుత్వాల పాలనలో తాగునీరు లేక వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి కిలోమీటర్ల మేర నడిచి నీటిని తీసుకువచ్చేవారన్నారు. వ్యవసాయానికి నీరు లేక, విద్యుత్ అందక రైతులు రోడ్లపైకి వచ్చేవారని తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏ ఒక్క రోజైనా రైతులు విద్యుత్ లేక సాగునీరు కోసం రోడ్లు ఎక్కడం చూశామా అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఇచ్చిన హామీలతో పాటు, ఇవ్వని ఎన్నో సంక్షేమ పథకాలు అందించి దేశంలోనే ఆదర్శంగా నిలిచారని గుర్తు చేశారు. తాను నిత్యం ప్రజాక్షేత్రంలో ఉండి సేవలు అందించానని ఎవరికి ఎలాంటి ద్రోహం చేయలేదన్నారు. వర్ధన్నపేట పట్టణాన్ని తీర్చి దిద్ది రూ.165 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఎక్కడ చూసినా నియోజకవర్గంలో అభివృద్ధి కనబడుతోందన్నారు. ఇంకా చేయాల్సింది ఎంతో ఉందన్నారు. తనను మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే రాష్ట్రంలోనే వర్ధన్నపేట నియోజక వర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్ది మొదటి స్థానంలో నిలబెడతానన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో సీఎం కేసీఆర్ హామీ ఇచ్చిన విధంగా అన్ని హామీలు అధికారంలోకి రాగానే అమలు చేస్తారన్నారు. సీఎం కేసీఆర్ మాట తప్పడు, మడమ తిప్పడని గుర్తు చేశారు. ఆయా కార్యక్రమాల్లో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, ఫాక్స్ చైర్మన్ కమ్మగోని రాజేష్‌ఖన్నా, ఆత్మ చైర్మన్ గుజ్జ గోపాల్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, వైస్ ఎంపీపీ సోమలక్ష్మి సోమయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ కమ్మగోని స్వామిరాయుడు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ఐనవోలు: ప్రచారం చేస్తున్న ఎంపీపీ మధుమతి



హసన్‌పర్తి: ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

అరూరి గెలుపునకు ఇంటింటి ప్రచారం

హసన్‌పర్తి : వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే అరూరి రమేశ్‌ను గెలిపించాలని మంగళవారం ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 55వ డివిజన్ సత్యసాయి కాలనీ, బ్యాంక్‌కాలనీల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి అరూరికి మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో చింతల లక్ష్మణ్, రాజయ్య, టీఆర్‌కే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఆదరించండి

ఐనవోలు : పేదలకు సంక్షేమ పథకాలు అందించి తెలంగాణను అభివృద్ధి పథంలో నిలబెడుతున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి ప్రజలు ఆదరించాలని ఎంపీపీ మార్నేని మధుమతి అన్నారు. మంగళవారం ఐనవోలులో బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి ఎంపీపీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి పక్షాల కల్లబొల్లి మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పోలెపల్లి శంకర్ రెడ్డి, మునిగాల సంపత్‌కుమార్, ఉస్మాన్ అలీ, వడిచర్ల శ్రీనివాస్, పల్లకొండ సురేష్, జన్ను కుమారస్వామి, అడ్డగూడి సతీష్, కొత్తూరి మధుకర్, తండ వెంకన్న, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు పవన్ కల్యాణ్ రాక

హన్మకొండ: సినీ నటుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఈ నెల 22న వరంగల్ పర్యటనకు వస్తున్నారు. వరంగల్ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల నుంచి బీజేపీ అభ్యర్థులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, రావు పద్మ గెలుపు కోసం ప్రచారం చేయనున్నారు. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు హనుమకొండ హంటర్ రోడ్డులోని సీఎస్‌ఆర్ గార్డెన్‌లో జరిగే విజయ సంకల్ప సభలో పాల్గొంటారన్నారు.

నేడు ఆత్మీయ సమ్మేళనం

నయీంనగర్: వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పద్మశాలీ ఆత్మీయ సమ్మేళనం బుధవారం హనుమకొండ హంటర్‌రోడ్ విష్ణుప్రియ గార్డెన్‌లో ఉదయం 11 గంటల నుంచి జరుగుతుందని హనుమకొండ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు చందా మల్లయ్య తెలిపారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డివిజన్ సంఘాలు, పరపతి సంఘాల సభ్యులు, కుల బాంధవులు తదితరులు పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలి

హన్మకొండ: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగించుకుని మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలని తెలంగాణ గంగపుత్ర సంఘం వరంగల్ మహానగర అధ్యక్షుడు పూస శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ వేడుకలు మంగళవారం హనుమకొండ 4వ డివిజన్‌లోని దుర్గాకాలనీలోని సంఘం భవనంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతు సీఎం కేసీఆర్ మత్స్యకారుల సంక్షేమం, మత్స్య అభివృద్ధి కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నాడన్నారు.అనంతరం మత్స్య కార్మికులు దామెర సతీష్, స్థానిక కార్పొరేటర్ విక్రమ్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం నగర మహిళా అధ్యక్షురాలు పొక్కుల సరోజన, బాధ్యులు పాల్గొన్నారు.

మద్యం షాపు ఏర్పాటు చేయొద్దు

ఖిలా వరంగల్: జనావాసాల మధ్య మద్యం షాపు ఏర్పాటు చేయొద్దని రుద్రమాంబనగర్ కాలనీ మహిళా ప్రతినిధి గుడికందుల రాణి తెలిపారు. వరంగల్ ఫోర్ట్‌రోడ్డుపై సాయిబాబా గుడి సమీపంలో మద్యం షాపు ఏర్పాటుకు అనుమతులు ఇవ్వొద్దంటూ మంగళవారం వరంగల్–ఖమ్మం జాతీయ రహదారి, ఫోర్ట్‌రోడ్డుపై కాలనీ మహిళాప్రతినిధుల ఆధ్వర్యంలో మహిళలు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. దీంతో రోడ్డుపై ఎక్కడికక్కడే వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ జామ్ కావడంతో ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. అనంతరం మహిళా ప్రతినిధి రాణి మాట్లాడుతూ ప్రధాన రోడ్డు, రుద్రమాంబ నగర్ కాలనీ పక్కనే మద్యం షాపు ఏర్పాటు చేయడం వల్ల మహిళలు, యువతీలు రహదారులపై వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లక్ష్మీ, వెంకటమ్మ, వింద్యా, శైలజ, రాజు, సాయితో పాటు 100 మంది కాలనీ మహిళలు పాల్గొన్నారు.



ఫోర్ట్‌రోడ్డుపై ఆందోళన చేస్తున్న మహిళలు

గోల్డ్‌మెడల్ విజేతలకు సన్మానం

కాజీపేట రూరల్ : తెలంగాణ స్టేట్ పవర్ లిఫ్టింగ్ పోటీలో కాజీపేట రాంనగర్‌కు చెందిన నేషనల్ పవర్ లిఫ్టర్ ఎండీ.జాఫర్ మాస్టర్ స్ట్రాంగ్ మ్యాన్ –2023 టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఈ నెల 19న జరిగిన స్పోర్ట్స్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ తెలంగాణ జోన్–ఇండియన్ పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ తెలంగాణ స్టేట్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్–2023 పోటీలో జాఫర్ 59 క్యాటగిరి విభాగంలో 305 కేజీలను లిఫ్టింగ్ చేసి ప్రథమస్థానంలో నిలిచి గోల్డ్ మెడల్‌ను సాధించాడు. అదేవిధంగా రైల్వే ట్రాక్ ఉమెన్ సిహెచ్.మమత 63 క్యాటగిరి విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్‌ను సాధించింది.జాఫర్, మమతను మంళవారం ఆర్పీఎఫ్ సీఐ సంజీవరావు, ఎస్సై శ్రావణిలు అభినందించారు.



విజేతలను అభినందిస్తున్న ఆర్‌పీఎఫ్ సీఐ

శాంతియుత ఎన్నికల నిర్వహణకు చర్యలు

● కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజ్



కాజీపేట: ఎన్నికలు సజావుగా, శాంతియుత వాతావరణంలో జరగడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు స్థానిక ఏసీపీ డేవిడ్ రాజ్ తెలిపారు. కాజీపేట సబ్‌డివిజన్ పరిధిలో స్టేషన్ ఘన్‌పూర్, వర్ధన్నపేట, హుస్నాబాద్, వరంగల్ పశ్చిమతో కలిసి నాలుగు నియోజకవర్గాలు ఉన్నాయన్నారు. ఆయా నియోజకవర్గాల్లో ఉన్న పోలింగ్ స్టేషన్ల స్థితిగతులను పరిశీలించడంతో పాటు రౌడీ షీటర్లు, అనుమానితులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. ఎన్నికల సన్నద్ధతపై సాక్షితో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు ఇలా ...

అనుమానితుల బైండోవర్...

సబ్‌డివిజన్ పరిధిలో వంగర, భీందేవరపల్లి, ఎల్కతుర్తి, హసన్‌పర్తి, కాజీపేట, మడికొండ, ధర్మసాగర్, వేలేరు పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉన్న అనుమానితులను దాదాపు 225 మందిని తహసీల్దార్ ఎదుట హాజరుపర్చామన్నారు. పాత నేరస్తులపై దృష్టి సారించాం. అన్ని పోలింగ్ కేంద్రాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం. స్థానికంగా సమావేశాలు నిర్వహించి ఓటు వేయడానికి ఏమైనా ఇబ్బందులున్నాయా? ఇది వరకు అలాంటి సంఘటనలు ఏమైనా జరిగాయా వంటివి తెలుసుకొని నివేదికలు రూపొందించి పంపిస్తున్నాం.

అంతా కలిసి...

గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఏమైనా గొడవలు జరిగాయా లేదా అనే రికార్డులను పరిశీలిస్తున్నాం. ఎక్కడా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఇబ్బంది జరిగిన దాఖలాలు లేవు. జిల్లా, మండల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నాం.

ఆకస్మిక తనిఖీలు...

ఎన్నికల కోడ్ రావడంతోనే డబ్బు, మద్యం, బహుమతుల తరలింపు అడ్డుకోవడానికి విస్తృత తనిఖీలు చేపట్టడం జరిగింది. పోలీస్‌స్టేషన్ల పరిధిలో వేర్వేరు ప్రాంతాల్లో వేర్వేరు సమయాల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తున్నాం. లాడ్జీల్లోనూ సోదాలు చేస్తున్నాం.

మాదిగల మద్దతు బీఆర్‌ఎస్‌కే



హన్మకొండ : కాంగ్రెస్ ఆరు అబద్దాల గ్యారంటీ పథకాలతో గద్దెనెక్కడం కోసం తెలంగాణ ప్రజలను మభ్యపెట్టి మోసం చేయాలని చూస్తుందని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ ఈదునూరి యాకయ్య మాదిగ అన్నారు. హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో మంగళవారం దండోరా ముఖ్య కార్యకర్తల సమావేశంలో హనుమకొండ ఇన్‌చార్జ్ నరేందర్ మాదిగ అధ్యక్షతన జరిగిన సమావేశానికి యాకయ్యమాదిగ మాట్లాడారు. దళితుల ఎదుగుదలను ఓర్వలేని కాంగ్రెస్ బీఆర్‌ఎస్‌పై తప్పుడు ప్రచారం చేస్తుందన్నారు.

సఖి సేవలను సద్వినియోగించుకోవాలి



హన్మకొండ: కుటుంబ కలహాలు, వరకట్న, లైంగిక వేధింపులకు గురవుతున్న మహిళలు, బాలికలు సఖి వన్‌స్టాప్ సెంటర్ బాసటగా నిలుస్తుందని, మహిళలు సఖి సేవలను సద్వినియోంచుకోవాలని సెంటర్ కేస్ వర్కర్ వి.వినీల అన్నారు. హనుమకొండ లష్కర్‌బజార్‌లోని విలియం కేరీ స్కూల్ లో మంగళవారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. లైంగిక వేధింపులకు ఎవరైనా పాల్పడితే మానసికంగా కృంగిపోకుండా ధైర్యంగా ఫిర్యాదు చేయాలని తెలిపారు. 0870–2452112 లేదా టోల్ ఫ్రీ నెంబర్ 181కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు.

వంశీకృష్ణకు తానా అవార్డు

నయీంనగర్ : అమెరికా చికాగోలో మాస్టర్స్ చదివి, న్యూయార్క్ డెవ్ ఆప్స్‌లో ఇంజనీర్‌గా పనిచేస్తున్న నగరానికి చెందిన అచ్యుత వంశీకృష్ణ రూపొందించిన 'మాస్టర్స్' షార్ట్ ఫిల్మ్‌కు తానా–2023 అంతర్జాతీయ ఉత్తమ షార్ట్ ఫిల్మ్ అవార్డు లభించింది. ఈ మేరకు అమెరికాలో ఫిలడెల్ఫియాలో జరిగిన తానా –2023 కన్వెన్షన్‌లో నిర్వాహకులు వంశీకృష్ణకు మొదటి విజేతగా అవార్డు ప్రదానం చేశారు. వంశీకృష్ణ మాట్లాడుతూ విదేశాల్లో భారతీయ విద్యార్థుల పై జరుగుతున్న యదార్థ సంఘటనల అధారంగా 'మాస్టర్' షార్ట్ ఫిల్మ్ రూపొందించినట్లు తెలిపారు.

దీపాల వెలుగుల్లో లింగేశ్వరుడు



కాజీపేట: నగరంలోని 62వ డివిజన్ విష్ణుపురి కాలనీలో కొలువుదీరిన స్వయంభూ శ్రీశ్వేతార్క మూలగణపతి దేవాలయంలో కార్తీక మాసోత్సవాల్లో వేడుకలను పురస్కరించుకుని మంగళవారం శ్రీసంతాన లింగేశ్వరస్వామికి దీపాలంకరణ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు తులసీపూజ, ఈశ్వరాభిషేకం, సహస్ర బిల్వదళ పూజలను జరిపించారు. దేవాలయ వ్యవస్థాపకులు ఐనవోలు అనంతమల్లయ్య శర్మ పర్యవేక్షణలో భక్తులు సంతానలింగేశ్వరుడి చుట్టూ దీపాలను వెలిగించి దీపారాధన పూజ చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు వెంకటేశ్వర్లుశర్మ కార్తీక మాస విశిష్టతపై భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు.

దళితులకు జరగని న్యాయం



నయీంనగర్ : బీఆర్‌ఎస్ పాలనలో దళితులకు న్యాయం జరగలేదని మోసపూరిత వాగ్దానాలతో దళితులకు అన్యాయం చేశారని ఆల్ ఇండియా దళిత్ రైట్స్ ఫెడరేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎం.జ్ఞాన్‌సాగర్ ఆవేదన వ్యక్తం చేశారు.మంగళవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పథకాలు వారి ఎమ్మెల్యేలు, కాంట్రాక్టర్ల జేబులు నింపడానికేనని అన్నారు.

వలసదారుల మాటలు నమ్మొద్దు



కాజీపేట : ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్



హన్మకొండ: బీఆర్‌ఎస్‌లో చేరికల అనంతరం మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్

● బీఆర్‌ఎస్ అభ్యర్థి వినయ్‌భాస్కర్

కాజీపేట : వలసదారుల మాయమాటలు నమ్మి ఓటేస్తే పశ్చిమ ప్రజలు భవిష్యత్‌లో అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి ఉంటుందని బీఆర్‌ఎస్ వరంగల్ పశ్చిమ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. మంగళవారం నగరంలోని 62వ డివిజన్‌లోని పలు కాలనీల్లో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చుట్టం చూపుగా వచ్చి వచ్చిపోయే స్థానికేతరుల మాటలను నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్, మేయర్ గుండు సుధారాణి, సుంచు కృష్ణ పాల్గొన్నారు.

మాల సంఘాల జేఏసీ మద్దతు

హన్మకొండ: దాస్యం వినయ్‌భాస్కర్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్, కన్వీనర్ నల్లాల కనుకరాజు తెలిపారు. మంగళవారం బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

సీపీఐ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిక

తెలంగాణ గుడిసెవాసుల సంఘం అధ్యక్షుడు కారు ఉపేందర్, గౌరవ అధ్యక్షుడు సిరబోయిన కరుణాకర్ ఆధ్వర్యంలో సీపీఐ నుంచి నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. వినయ్ బాస్కర్ కండువా కప్పి ఆహ్వానించారు.

వృత్తిదారులకు అండగా బీఆర్‌ఎస్ సర్కార్

కుల వృత్తిదారులకు బీఆర్‌ఎస్ సర్కార్ అండగా ఉందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. మంగళవారం బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో నాయి బ్రాహ్మణ సంఘం, ఆటో, ట్రాలీ, జీప్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళనంలో వినయ్ భాస్కర్ మాట్లాడుతూ కుల వృత్తిదారుల అభివృద్ధి సంక్షేమానికి సీఎం కేసీఆర్ అనేక పథకాలు అమలు చేస్తూ వారి అభ్యున్నతికి పాటుపడుతున్నారన్నారు. సమ్మేళనంలో ఎంపీ పసునూరి దయాకర్, భారత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయభాస్కర్, ఆర్టీ సభ్యుడు కాటాపురి రాజు, కార్పోరేటర్ ఎలకంటి రాములు, పాల్గొన్నారు. మంగళవారం కాకతీయ యూనివర్శిటీ మైదానంలో వాక్ అండ్ టాక్ విత్ ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించారు.

కళ్ల ముందే అభివృద్ధి

బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి చెప్పుకోవాల్సిన అవసరం లేదని కళ్ల ముందే మనందరికీ కనిపిస్తుందని దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. మంగళవారం రాత్రి హనుమకొండ 59వ డివిజన్ భవానీనగర్, ఇందిరా నగర్, ఎక్సైజ్ కాలనీలో ప్రచారం నిర్వహించారు.

బీజేపీతోనే తూర్పు అభివృద్ధి సాధ్యం



కాశిబుగ్గ : బీజేపీలో చేరిన వారితో ఎర్రబెల్లి ప్రదీప్‌రావు



వరంగల్ : 12, 13వ డివిజన్లలో ప్రచారం చేస్తున్న ప్రదీప్‌రావు

● ఆ పార్టీ అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

కాశిబుగ్గ : బీజేపీతోనే వరంగల్ తూర్పు నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమవుతుందని బీజేపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. మంగళవారం 12, 23, 27 డివిజన్లకు పలువురు ఓ సిటీలోని ఎర్రబెల్లి ప్రదీప్‌రావు క్యాంపు కార్యాలయంలో బీజేపీలో చేరారు. వారికి ప్రదీప్‌రావు కాషాయం కండువా కప్పి ఆహ్వానించారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీజేపీలో చేరిన వారిలో విజయ,మౌనిక, అంజ మ్మ, అమీర్, శంకర్, నాగరాజు, అరవింద్, మహేష్, రామకృష్ణ, రాజేందర్, గోపి ఉన్నారు.


కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు ఓటు వేస్తే రౌడీయిజాన్ని ప్రోత్సహించినట్లే

వరంగల్ : కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు ఓటు వేస్తే రౌడీయిజాన్ని ప్రోత్సహించినట్లే అని ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. మంగళవారం 12వ డివిజన్ దేశాయిపేటకు చెందిన సుమారు 200 మంది యువకులు రాజుయాదవ్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరగా ఆయన కాషాయ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తూర్పులోని 13వ డివిజన్ ఎల్‌బీ నగర్, ఏఎం పీఎం హోటల్, టీచర్స్ కాలనీ, పార్క్, గణేష్ కాలనీ, నవయుగ కాలనీ ప్రాంతాల్లో ప్రదీప్‌రావు విస్తృత ప్రచారం నిర్వహించారు.

ప్రదీప్‌రావుపై దాడికి పాల్పడ్డ గూండాలు

వరంగల్ తూర్పు బీజేపీ అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావుపై సోమవారం 37వ డివిజన్ శంభునిపేటలోని బుడగ జంగాల కాలనీ గిరిప్రసాద్ కాలనీలో బీఆర్‌ఎస్ అభ్యర్థి నరేందర్ అనుచరులు, గూండాలు దాడి చేయడం దారుణమని డాక్టర్ వెంకటరమణ అన్నారు. మంగళవారం ఎల్‌బీ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు.

డీజిల్ లోకోషెడ్‌లో రైల్వే సమ్మె బ్యాలెట్



సమ్మె బ్యాలెట్‌లో పాల్గొన్న రైల్వే నాయకులు, కార్మికులు

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే డీజిల్ లోకోషెడ్‌లో మంగళవారం సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ డీజిల్ బ్రాంచీ ఆధ్వర్యంలో సమ్మె బ్యాలెట్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ, జోనల్ ప్రెసిడెంట్ కాల్వ శ్రీనివాస్ మాట్లాతూ కేంద్రం రైల్వే కార్మికుల పెండింగ్ డిమాండ్ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని చేపట్టిన సమ్మె బ్యాలెట్‌లో కార్మికులందరూ పాల్గొనాలని పిలుపు నిచ్చారు. అనంతరం రైల్వే కార్మికులు తమ అభిప్రాయాలను ఓటుద్వారా సమ్మె బ్యాలెట్‌లో వేశారు.కార్యక్రమంలో రైల్వే మజ్దూర్ యూనియన్ డీజిల్ షెడ్ బ్రాంచ్ నాయకులు వేదప్రకాష్, జానీ, భిక్షపతి, యాదగిరి, రాజేశ్వర్, తిరుపతి, మహిళ కార్మికులు, కార్మికులు పాల్గొన్నారు.